

సర్వస్వం పోయింది.. ఆదుకోండి..

మోరంచపల్లి గ్రామస్తులు వరద ఉధృతిలో సర్వం కోల్పోయారు. కట్టుబట్టలు మాత్రమే మిగిలాయి. - 8లో▸



విద్యుత్ పునరుద్ధరణ పనులు ముమ్మరం - 8లో▸

భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని గోపాల్ రావు అన్నారు.

గరిష్టం/కనిష్టం
27⁰ /24⁰

వాతావరణం

జిల్లాలో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

న్యూస్‌రీల్

వాగులు దాటి వైద్యం



వెంకటాపురం(కె): వాగులు దాటుకుంటూ వెళ్లి వైద్య సేవలను ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అందించారు. మండల పరిధిలోని లక్ష్మీపురంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించేందుకు వైద్యాధికారి సిబ్బందితో కలిసి లక్ష్మీపురం గ్రామ సమీపంలో ఉన్న వాగును దాటుకుంటూ వెళ్లి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం నాయకుల గూడెం, ఆలుబాక గ్రామాల్లో వైద్యశిబిరాలను నిర్వహించారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



వాజేడు: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. మండల పరిధిలోని పేరూరు వద్ద శనివారం 18.820 మీటర్ల మేర పెరిగింది. దీంతో పల్లపు ప్రాంతాల గుండా గోదావరి వరద వేగంగా ప్రవహిస్తోంది. వాగులు ద్వారా వచ్చిన వరదతో పొలాలు, చేలు నీటమునిగాయి. ఏడ్జర్లపల్లి– పూసూరు, వాజేడు– గుమ్మడి దొడ్డి, కడేకల్– కృష్ణాపురం, పేరూరు– కృష్ణాపురం, పెద్ద గొళ్లగూడెం– చీకుపల్లి, చీకుపల్లి– గుమ్మడి దొడ్డి గ్రామాల్లో రహదారులను ముంచెత్తింది. పూసూరు గోదావరి బ్రిడ్జి వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది.

మునిగిన కృష్ణాపురం, కడేకల్ బ్రిడ్జి


మండల పరిధిలోని కృష్ణాపురం, కడేకల్ గ్రామాల మధ్యన ఉన్న బ్రిడ్జి శనివారం మునిగింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద మూలంగా గోదావరి పెరుగుతోంది. దీంతో మర్రిమాగు వాగు ద్వారా వచ్చిన వరదకు శనివారం బ్రిడ్జి ముంపునకు గురైంది. బ్రిడ్జి అవతలి వైపున ఉన్న చంద్రుపట్ల, కృష్ణాపురం, పెద్దగంగారం, టేకులగూడెం గ్రామాలకు ఇటు కడేకల్ వైపు, పేరూరు వైపు రాకపోకలు నిలిచిపోయాయి.

రామప్పను సందర్శించిన అదనపు కలెక్టర్



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని శనివారం ములుగు అదనపు కలెక్టర్ వేణుగోపాల్ కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా రామప్ప రామలింగేశ్వరస్వామికి వారు పూజలు నిర్వహించగా ఆలయ పూజారి ఉమాశంకర్ వారికి తీర్థప్రసాదాలు అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆలయ విశిష్టత గురించి ఆలయ గైడ్ విజయ్‌కుమార్ వివరించగా రామప్ప శిల్ప సంపద ఎంతో గొప్పగా ఉందని కొనియాడారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి పిల్లి శ్రీపతి, తహశీల్దార్ మంజుల, ఆర్‌ఐ రాజకుమారి, ఎంపీడీఓ శ్రీనివాస్‌లు ఉన్నారు.

డ్రోన్ కెమెరాతో గాలింపు చర్యలు



మల్హర్: వరదల్లో గల్లంతైన మృతదేహాల కోసం కాటారం మండలంలోని తాడిచర్ల–ఖమ్మపల్లి మానేరు పరివాహక ప్రాంతంలో కాటారం సీఐ రంజిత్‌రావు, కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్ శనివారం డ్రోన్ కెమెరా సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. వరద కారణంగా భూపాలపల్లి మండలం మోరంచపల్లి వద్ద నలుగురు గల్లంతు కాగా.. ఇద్దరి ఆచూకీ లభించింది. మరో ఇద్దరి కోసం తాడిచర్ల, మల్లారం, వల్లెకుంట మానేరు పరివాహక పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో గాలింపు చేపట్టినట్లు తెలిపారు. వాగులో మృతదేహాలు కనిపిస్తే సమాచారం అందించాలని కోరారు.

వరద తగ్గింది.. వేదన మిగిలింది

- వంట పొలాల్లో ఇసుక మేటలు
- వరినారు వరద పాలు
- ఆందోళనలో రైతన్నలు

ఎస్‌ఎస్‌తాడ్వాయి/ఏటూరునాగారం: ముంపు ప్రాంతాల్లో వరద తగ్గినా.. ప్రజలకు వేదన మాత్రం మిగిలే ఉంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వచ్చిన వరదలతో వచ్చిన నష్టం అంతా ఇంత కాదు. ఎవరిని పలకరించిన కన్నీళ్లే కనిపిస్తున్నాయి. వరద చేసిన నష్టంతో కొన్ని కుటుంబాలు ఏళ్ల పాటు వెనుకకు పోయాయి. వరదల వల్ల పంట చేళ్లలోకి నీరు చేరడంతో పాటు ఇసుక మేటలు వేయడంతో పంటలు దెబ్బతిన్నాయి. శుక్రవారం నుంచి వర్షం తెరిపివ్వడంతో రైతులు తమ పంట పొలాలను బాగు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఇసుక మేటలు.. వరినార్లు కొట్టుకుపోయాయి..

జంపన్నవాగు వరదకు మేడారం, రెడ్డిగూడెం, కొత్తూరు, ఊరట్టం, కన్నెపల్లి, కాల్వపల్లి, నార్లాపూర్, వెంగ్లాపూర్, పడిగాపూర్, ఎల్బాక గ్రామాల్లో వేలాది ఎకరాల పంట భూములు నీటమునడంతో ఇసుక మేటలు వేసింది. వరినార్లు నీటమునిగిపోయాయి. అదే విధంగా గౌరారం వాగు ఉధృతికి దామెరవాయి గ్రామంలోని పంట పొలాల్లో ఇసుక మేటలు వేసింది. ఆ గ్రామానికి చెందిన నూశెట్టి వెంకన్నకు చెందిన రెండు మోటార్లు కనిపించకుండా పోయాయి. రైతు వినోద్‌కుమార్‌కు చెందిన ఎకరం, సింగారం వాగు ఉధృతికి మరో రైతు రాజారాంకు చెందిన వరినారు వరదపాలైంది. నాట్లు వేసే సమయం ఆసన్నమైన తరుణంలో నారు మొత్తం వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో రైతులు పంటలు సాగు చేసే పరిస్థితి కన్పించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా జంపన్న వాగు ఉధృతికి దొడ్ల గ్రామం నీట మునిగింది. ఈ గ్రామంలో నివాసం ఉంటున్న 52 మంది ప్రాణాలను కాపాడుకునేందుకు పరుగులు తీశారు. చిన్నబోయినపల్లిలో తలదాచుకున్నారు. కొంతమంది చదువుకున్న సర్టిఫికెట్లు, బియ్యం, బట్టలు సైతం కొట్టకపోయాయి. ఇళ్ల గోడలు, ఇళ్లు నేలమట్టం అయ్యాయి.

మేడారంలో పర్యటించిన మంత్రి

మేడారంలో మంత్రి సత్యవతిరాథోడ్ శనివారం పర్యటించారు. తొలుత ఏటూరునాగారం ముంపు గ్రామాల్లో పర్యటించిన మంత్రి అనంతరం మేడారాన్ని సందర్శించారు. జంపన్నవాగును పరిశీలించి వరద పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జంపన్నవాగు వరదలో మునిగిన చిరువ్యాపారుల దుకాణాల పరిస్థితులపై ఆరా తీశారు. మేడారంలో పారిశుద్ధ్య చర్యలు, విద్యుత్ పునరుద్ధరణ చర్యలు త్వరగా చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. సమ్మక్క– సారలమ్మలను దర్శించుకుని పూజలు చేశారు. ఎలాంటి విపత్తులు మళ్లీ రాకుండా చూడాలని అమ్మవార్లను కోరుకున్నారు.



పొలాల్లో వేసిన ఇసుక మేటలు



వరద పరిస్థితులను పరిశీలిస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్



వరదకు కొట్టుకుపోయిన నారు



వ్యాపారులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వరద బాధితులకు సాయం అందించాలి

మేడారం జంపన్నవాగు ముంపునకు గురైన వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సాయం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మేడారంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన శనివారం వరద బాధితులను పరామర్శించారు. వరద నష్టాలపై వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ముంపు బాధితులకు సాయం అందించి, పంట పొలాలు మునిగిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. వరద బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా అదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ, మండల అధ్యక్షుడు మల్లెల రాంబాబు, తెలంగాణ రాష్ట్ర పాలసీ అండ్ రీసెర్చ్ నాయకులు రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో పారిశుద్ధ్య పనులు

తాడ్వాయి మండల పరిధిలోని జంపన్నవాగు వదర ముంపునకు గురైన మేడారంలో పారిశుద్ధ్య పనులను శనివారం ముమ్మరంగా చేపట్టారు. వరద మేడారాన్ని ముంచెతడంతో దుకాణాలన్నీ నీట మునిగిపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయింది. రోడ్లన్నీ బురదగా మారాయి. గ్రామ పంచాయతీ అధికారులు రోడ్లపై పేరుకుపోయిన బురదను డోజర్లతో తొలగిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్తాచెదారాన్ని తొలగించి ట్రాక్టర్‌లో డంపింగ్ యార్డులకు తరలించారు. దుర్వాసన రాకుండా రోడ్ల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. ఎంపీఓ శ్రీధర్‌రావు పారిశుద్ధ్య పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. మేడారంలో 50 మంది కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. రెండు ట్రాక్టర్లు, మూడు జేసీబీల సాయంతో చెత్తాచెదారం తొలగింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికులు



చెత్తసేకరిస్తున్న కార్మికులు

7.50 క్వింటాల బియ్యం ముద్దయ్యాయి..



ఇంట్లో తినేందుకు నిల్వ చేసుకున్న 7.50 క్వింటాల బియ్యం తడిసి ముద్దయ్యాయి. బట్టలు, ఇంట్లో అంతా బురదమయమైంది. గృహోపకరణ వస్తువులకు నీళ్లుపోయి అంతా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి

– చందా వినోద్, దొడ్ల, ఏటూరునాగారం

సర్టిఫికెట్లు కొట్టుకుపోయాయి..



వరద వస్తుందని ఇంటికి దూరంగా కట్టేసిన ఎడ్లను వదిలేసి ఇంటికి వచ్చే సరికి ఇల్లంతా మునిగిపోయింది. ట్రంకు బాక్సులో పెట్టుకున్న పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లన్నీ కూడా కొట్టుకపోయాయి. వరద వస్తుండడంతో తల్లిదండ్రులు వీరయ్య, మాణిక్యంలు ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. వారితో పాటు నేను కూడా చిన్నబోయినపల్లిలో పునరావాస కేంద్రానికి వెళ్లాను. తెల్లారి వచ్చి చూసేసరికి ఇంటి గోడలన్నీ పోయాయి. ఇంట్లో సామాను నీటిపాలైంది. సర్టిఫికెట్లు ట్రంకు బాక్సు వరదలో కొట్టుకుపోయింది.

– పాయం ప్రవీణ్‌కుమార్, దొడ్ల

ఇల్లంతా గుల్లయింది..



వరదతో ఇల్లంతా గుల్లయింది. మంచాలు కొట్టుకపోయాయి. నాలుగు క్వింటాల బియ్యం తడిసి పనికిరాకుండా పోయాయి. ఇంటిగోడలు అన్ని పడిపోయాయి. దిక్కు తోచని స్థితిలో ఉన్నాం. ఒక్క రోజు వచ్చిన వరదతో అంతా నేలమట్టమైంది. సామానులు పోయాయి పిడికెడు బియ్యం కూడా లేకుండా పోయాయి. భూమి కాగితాలు తడిసిపోయాయి.

– చందా నర్సమ్మ, దొడ్ల

ముంపు గ్రామాల్లో ఎమ్మెల్యే సీతక్క పర్యటన

- ఆదుకోవాలని బాధితుల వేడుకోలు



సీతక్కపై పడి రోదిస్తున్న వరద బాధితురాలు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండల పరిధిలోని ముంపు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క శనివారం పర్యటించారు. మేడారం, ఊరట్టం, రెడ్డిగూడెం, కన్నెపల్లి, కొత్తూరు, నార్లాపూర్, కాల్వపల్లి గ్రామాల్లో సీతక్క పర్యటించి బాధితులతో మాట్లాడి అధైర్య పడొద్దని మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా బాధితులు సీతక్కకు తమ ఆవేదనను వెలిబుచ్చారు. మేడారంలో వచ్చిన వరదలతో సర్వం కోల్పోయిన చిరు వ్యాపారులు సీతక్క ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ భారీ వర్షాలకు వరద ముంపు మూలంగా సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, కలెక్టర్ ఇలా త్రిపాఠిలని ఫోన్ ద్వారా కోరారు. వరదలకు ప్రజలు, వ్యాపారస్తులు సర్వం కోల్పోయారన్నారు. కొండాయి, బూరుగుపేట గ్రామాల్లో ప్రాణనష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం ముంపునకు గురైన బాధిత కుటుంబాలను సాయం అందించి ఆదుకోవాలి డిమాండ్ చేశారు. వరదల్లో గల్లంతై మృతి చెందిన కుటుంబాలకు రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. అదే విధంగా దాతలు సైతం ముందుకువచ్చి బాధితులకు సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, గౌరవ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, సర్పంచులు సునీల్, కల్యాణి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష సాయం అందజేత

ములుగు: వరుస వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన వరద బాధితుల సహాయానికి ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ రూ. లక్ష అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు తమవంతుగా తగిన సహాయం అందించాలని పిలుపునిచ్చారు. ముంపు ప్రాంతాలకు వెళ్లి తగిన సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం..

- అందుబాటులో మందులు
- ముంపు ప్రాంతాల్లో ప్రజలకు తక్షణ వైద్యం
- సాక్షి ఇంటర్వ్యూలో డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య



SAKSHI INTERVIEW సాక్షి

ములుగు: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో ఏటూరునాగారం, వెంకటాపురం(కె), వాజేడు, కన్నాయిగూడెం, ఎస్‌ఎస్ తాడ్వాయి, గోవిందరావుపేట, వెంకటాపురం (ఎం) మండలాల్లో అయా గ్రామాలు ముంపునకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో వైద్యశాఖ తరపున చేపట్టనున్న కార్యక్రమాలపై సాక్షి ఆధ్వర్యంలో శనివారం ఇంటర్వ్యూ నిర్వహించగా డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య వివరాలను వెల్లడించారు.

ప్రశ్న: దోమలు వృద్ధి చెందకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

జవాబు: గ్రామాల్లో వరదల కారణంగా పేరుకుపోయిన నీటి గుంతల్లో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. మేజర్ గ్రామ పంచాయతీల్లో 5వేల చొప్పున, సాధారణ గ్రామ పంచాయతీల్లో వెయ్యి చొప్పున ఆయిల్ బాల్స్ విడుదల చేస్తాం. గ్రామాల వారీగా దోమల మందు పిచికారీ చేయిస్తున్నాం.

ప్రశ్న: జిల్లాలో రోజువారీగా ఎన్ని టీంలు ఆరోగ్య క్యాంపులు నిర్వహిస్తున్నాయి.

జవాబు: వర్షాలు అధికంగా కురిసిన క్రమంలో సుమారు 50 ఆరోగ్య క్యాంపులు నిర్వహించాం. ఆదివారం నుంచి జిల్లా వ్యాప్తంగా రోజువారీగా 30 ఆరోగ్య క్యాంపులు నిర్వహిస్తాం. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైతే ప్రతీ పీహెచ్‌సీ నుంచి రూ.15,000 ఖర్చు చేసి వైద్య సామాగ్రిని కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేయనున్నాం.

ప్రశ్న : ప్రజలకు ఆరోగ్య సమస్యలు రాకుండా ఏ విధమైన చర్యలు తీసుకుంటారు.

జవాబు: ఏటూరునాగారం మండలం కొండాయి, దొడ్ల, మల్యాల, ఎస్‌ఎస్ తాడ్వాయి మండలం మేడారం, ఊరట్టం, రెడ్డిగూడెం, వెంకటాపురం(ఎం) బూర్గుపేట, వాజేడు, వెంకటాపురంలోని తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తాం. మేడారంలో పర్యటించిన సమయంలో ప్రతీ షాపు నుంచి తీవ్ర దుర్గంధం రాగా కోళ్లు చనిపోనట్లు గుర్తించాం. గ్రామపంచాయతీ అధికారులతో సమన్వయంగా ఉంటూ వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాం.

ప్రశ్న : వైద్యాధికారులు అందుబాటులో ఉన్నారా.

జవాబు : వరుస వర్షాలతో నీరు కాలుష్యమైంది. వైద్యాధికారులు అందుబాటులో ఉండి డయేరియా, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలకుండా రేపటి నుంచి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే స్పందిస్తూ వైద్యం అందిస్తారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బందికి సెలవులను రద్దు చేశాం.

ప్రశ్న : ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఎక్కడ ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది.

జవాబు: గోదావరి పరీవాహక ప్రాంతంతో పాటు ఎస్‌ఎస్ తాడ్వాయి, గోవిందరావుపేట ప్రాంతాల్లో ఎక్కువగా ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయి. జ్వరాలు ఉన్నట్లయితే వెంటనే స్థానిక వైద్యాధికారులను సంప్రదించాలి. వైద్య సేవలు అందించడానికి శాఖ తరపున అన్నిరకాల చర్యలు తీసుకున్నాం.

పారిశుద్ధ్య పనులకు 200 మంది కార్మికులు

- డీపీఓ వెంకయ్య వెల్లడి

ములుగు: అధిక వర్షాలతో ముంపు గ్రామాల్లో పేరుకపోయిన చెత్తా చెదారం తొలగించడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు చేయడానికి రాజమండ్రి నుంచి 200 మంది కార్మికులను తీసుకురానున్నట్లుగా జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) కొండా వెంకయ్య తెలిపారు. పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉన్న కారణంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకున్నామని శనివారం సాక్షికి వెల్లడించారు. ఎస్‌ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని మేడారం, రెడ్డిగూడెం, ఏటూరునాగారం మండల పరిధిలోని కొండాయి, దొడ్ల, మల్యాల, వంటి ప్రాంతాల్లో రోడ్లపై ఫీటు మేర బురద పేరుకుపోయిందన్నారు. వాటిని తొలగించడానికి ప్రైవేట్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలోని మేజర్ గ్రామ పంచాయతీల్లో 5వేల చొప్పున, ఇతర గ్రామ పంచాయతీల్లో వెయ్యి చొప్పున పేరుకుపోయిన నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్‌ను వదలనున్నట్లు తెలిపారు. దీంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా స్ప్రే చేస్తామన్నారు. పంచాయతీ కార్మికులను అప్రమత్తం చేశామని వెల్లడించారు. సమస్య కొలిక్కి వచ్చేంత వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించామన్నారు.

కుంభవృష్టితో వరదలు

- 70సెంటీమీటర్ల వర్షంతో ఉప్పొంగిన వాగులు
- జిల్లాలో 12 మందిని పోగొట్టుకున్నాం
- మంత్రి సత్యవతిరాథోడ్

ఏటూరునాగారం: అమెజాన్ అడవుల్లో కుంభవృష్టి వర్షం కురిసినట్లుగా జిల్లాలో వర్షం కురవడం వల్ల వాగులు వంకలు ఉప్పొంగి అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షం తెరిపించినట్లుగా కనిపిస్తోందని గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మండల పరిధిలోని రామన్నగూడెం పుష్కరఘాట్ గోదావరి వరద ఉధృతి, ముళ్లకట్ట బ్రిడ్జి వద్ద గోదావరి, కొండాయి గ్రామం వెళ్లేదారిలో కొట్టుకుపోయిన బ్రిడ్జిని మంత్రి సత్యవతిరాథోడ్ ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్, ఎస్పీ గాష్‌ఆలం, ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏఎస్పీ సంకీర్త్, జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతితో కలిసి శనివారం సందర్శించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడారు. వర్షంతో జిల్లాలో తీవ్రనష్టం వాటిల్లిందని, 12 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అందులో ఒక కొండాయిలోనే ఎనిమిది చనిపోవడం బాధాకరమన్నారు. భవనాలు, చెట్లపై తలదాచుకున్న ముంపు బాధితులను ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు 55 మందిని కాపాడారన్నారు. జిల్లాలో ఇంకా కొంత మంది కొట్టుకుపోయినట్లు తెలుస్తుందని వారి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. గుండ్లవాగు ప్రాజెక్టు, జంపన్నవాగు వల్ల కొండాయి గ్రామానికి వరద పోటెత్తిందన్నారు. రోడ్లు, చెరువులు, కరకట్టలు తదితర మరమ్మతు పనులు చేయాలని అధికారులకు చెప్పామన్నారు. 58 గ్రామాలకు విద్యుత్ సరఫరా లేదని ప్రస్తుతం 25 గ్రామాలకు పునరుద్ధరించామని మిగిత గ్రామాలకు మరుసటి రోజు పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు బుచ్చయ్య, గ్రంథాలయ చైర్మన్ గోవింద్‌నాయక్, ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ పాల్గొన్నారు. అనంతరం పస్రా నుంచి ఏటూరునాగారం వైపు వెళ్లే దారిలో ఉన్న గుండ్లవాగు రోడ్డు పునరుద్ధరణ పనులను మంత్రి పరిశీలించారు. ఎన్‌హెచ్ పునరుద్ధరణకు సంబంధించిన నివేదికలను అందజేయాలన్నారు. ముంపు ప్రాంతాల పర్యటనకు వెళ్లిన మంత్రి దొడ్ల గ్రామంలో వరద ముంపునకు గురైన 52 మందికి మంత్రి సరుకులను పంపిణీ చేశారు. 350ఎకరాల్లో పంటలు దెబ్బతిని ఇసుక మేటలు వేసిందని రైతు రామారావు మంత్రికి వెల్లడించారు.

సర్పంచ్‌ను ఓదార్చిన మంత్రి

కొండాయి సర్పంచ్, మేడారం సారలమ్మ పూజారి కాక వెంకటేశ్వర్లు అత్త దబ్బగట్ల సమ్మక్క వరదలో కొట్టుకుపోయి మృతి చెందడంతో కొండాయికి చేరుకున్న మంత్రి అతడిని ఓదార్చారు. అధైర్యపడకుండా చాలా మంది ప్రాణాలను కాపాడావని, అనుకోకుండా ఇలా జరిగిందని ధైర్యం చెప్పారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల సేవలు భేష్ అని మంత్రి వివరించారు.



దొడ్ల నుంచి కొండాయికి వెళ్లడానికి ఎన్‌డీఆర్‌ఎఫ్‌ల సాయంతో దిగుతున్న మంత్రి సత్యవతి



సర్పంచ్‌ను ఓదారుస్తున్న మంత్రి

ముంపు గ్రామాల్లో అధికారుల పర్యటన



ఊరట్టం గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: ముంపు గ్రామాలైన మేడారం, ఊరట్టం, నార్లాపూర్, కొత్తూరు గ్రామాల్లో డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్ శనివారం పర్యటించారు. గ్రామాలను సందర్శించారు. మేడారాన్ని సందర్శించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వరద ముంపునకు గురైన దుకాణాలను సర్దుబాటు చేసుకుంటున్న వ్యాపారులతో మాట్లాడి నష్టాలపై ఆరా తీశారు. మేడారం ముంపు గ్రామాల పర్యటనకు వచ్చిన సీతక్కను అధికారులు కలిసి పారిశుద్ధ్య చర్యలను వివరించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ములుగు: వరుస వర్షాలతో ఇబ్బందులు పడ్డ ప్రజలను ఆదుకోవడానికి జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి ములుగు జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో శనివారం మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు. గోదావరికి మూడో ప్రమాద హెచ్చరిక జారీ అయిన నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ముంపు ప్రాంతాల ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ప్రజలకు ఆరోగ్య సమస్యలు రాకుండా చూడాలన్నారు. వైద్యశాఖ, పంచాయతీ శాఖ సమన్వయంగా నడుచుకోవాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మంచినీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు.



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి

గోదావరిని పరిశీలించిన మంత్రి

వాజేడు: మండల పరిధిలోని పూసూరు బ్రిడ్జి వద్ద గోదావరి వరదను మంత్రి సత్యవతి పరిశీలించారు. నేరుగా పూసూరు బ్రిడ్జి దగ్గరకు వచ్చిన మంత్రి గోదావరి ప్రవాహాన్ని చూశారు. అనంతరం ములుగు ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్‌లతో ఆమె మాట్లాడారు. గోదావరి పరిస్థితి,పునరావాస కేంద్రాలకు ఎంత మందిని తరలించారనే వివరాలపై ఆరా తీశారు.

క్లుప్తంగా

పలు రైళ్లు రద్దు

● జూలై 31 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు..



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ సబ్ డివిజన్ పరిధిలో రైల్వే ట్రాక్ నిర్వహణతో పాటు మూడో రైల్వే లైన్ నిర్మాణ పనుల నేపథ్యంలో పలు ప్యాసింజర్ రైళ్లను జూలై 31 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం తెలిపారు. ఈ మేరకు కాజీపేట రైల్వే అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం విచారణ కౌంటర్ వద్ద రైళ్ల రద్దు బోర్డును డిస్‌ప్లే చేశారు.

రద్దయిన రైళ్ల వివరాలు

కాజీపేట–డోర్నకల్ ప్యాసింజర్ (07753), డోర్నకల్–కాజీపేట (07754) ప్యాసింజర్, సికింద్రాబాద్–వరంగల్ (07462) పుష్‌పుల్, వరంగల్–సికింద్రాబాద్ (07463) పుష్‌పుల్, కాజీపేట–సిర్పూర్ (17003) సింగరేణి, సిర్పూర్ –కాజీపేట (17004) సింగరేణి, కాజీపేట–బల్లార్షా (17035), బల్లార్షా –కాజీపేట (17036), భద్రాచలంరోడ్–బల్లార్షా (17033), బల్లార్షా–భద్రాచలంరోడ్ (17034) సింగరేణి రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

కేయూ పరిధిలో పరీక్షలు వాయిదా

● పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 30 ,31 ఆగస్టు 1, 2 తేదీల్లో నిర్వహించనున్న వివిధ పరీక్షలను వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ, ఫార్మడీ, బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ సెమిస్టర్ పరీక్షలు, పీజీ కోర్సులకు సంబంధించి నాలుగో సెమిస్టర్ ప్రాక్టికల్స్ పరీక్షలు, లా ఫైనల్ విద్యార్థులకు మూట్‌కోర్టు పరీక్షలు వాయిదా వేసినట్లు వివరించారు. వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పరీక్షలను వాయిదా వేశామన్నారు. వాయిదాపడిన పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

సర్వస్వం పోయింది.. ఆదుకోండి..

● ఆపన్నహస్తం కోసం మోరంచపల్లి వాసుల ఎదురుచూపు
● ముందుకు వస్తున్న నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు
● నిత్యావసరాలు పంపిణీ చేయని అధికారులు
● నష్టపరిహారం అందించాలని వేడుకుంటున్న బాధితులు



కన్నీటి గాథ



వరదల్లో కొట్టుకుపోయిన చెంచు కాలనీ



తడిసిన పాడైన సూపర్‌మార్కెట్ సామగ్రి

భూపాలపల్లి అర్బన్/భూపాలపల్లి రూరల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి గ్రామస్తులు వరద ఉధృతిలో సర్వం కోల్పోయారు. కట్టుబట్టలు మాత్రమే మిగిలాయి. వరదలో నిత్యావసరాలు, వాహనాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను కోల్పోయారు. కట్టుకోవడానికి బట్టలు.. కప్పుకోవడానికి దుప్పటి కుడా లేని దుస్థితి నెలకొంది. వరదల నుంచి తేరుకొని మూడు రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో నష్టపరిహారం ఇస్తుందా లేదా అని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఆపన్నహస్తాల కోసం ఎదురు చుస్తున్నారు. గ్రామంలో ఏ ఒక్కరిని కదిలించినా 'కన్నీరే' ఉబికి వస్తోంది. కాగా, నిత్యావసర వస్తులు అందించేందుకు పలువురు ముందుకు వస్తున్నారు.

ప్రభుత్వం నుంచి అందని తక్షణ సాయం

ఊరికి ఊరంత వరదలో మునగడంతో కట్టుబట్టలతో బయటికి వచ్చిన బాధితులకు ప్రభుత్వం నుంచి కనీసం తక్షణ సాయం కూడా అందలేదు. నిత్యావసర వస్తువులు, బియ్యం కూడా పంపిణీ చేయలేదు. నష్టపోయిన ఆస్తికి, పశువులకు పరిహారం కింద ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.

10 ఇళ్ల వరద తాకిడి దెబ్బతినగా చెంచుకాలనీకి చెందిన 18 గుడిసెలు వరదలో కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కొక్క ఇంటిలో రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోరంచపల్లి బస్టాండ్ సమీపంలోని సంతోషిమాత సూపర్‌మార్కెట్‌లో రూ. 20లక్షల విలువైన కిరాణా సామగ్రి తడిసి పాడైంది.

ముందుకు వస్తున్న పలువురు..

మోరంచపల్లిలో జరిగిన నష్టాన్ని చూసిన పలువురు చలించిపోతున్నారు. పగవారికి కూడా ఇలాంటి కష్టం రావొద్దని వేడుకుంటున్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాల నాయకులు ముందుకు వచ్చి బియ్యం, కూరగాయలు, వంట సామాను, చద్దర్లు, మ్యాట్లు, పండ్లు, పప్పులు, చీరలు, ఇతర వస్తువులు ఇంటింటికీ తిరుగుతూ బాధితులకు అందజేస్తున్నారు.

రూ.20 లక్షల నష్టం జరిగింది



మోరంచపల్లిలో వచ్చిన వరదతో మా సూపర్‌మార్కెట్‌లో రూ.20లక్షల విలువైన వస్తువులు తడిసి పాడయ్యాయి. చెక్కెర, పప్పు, పిండి, బియ్యం ఇతర వస్తువులు పాడయ్యాయి. అప్పు తెచ్చి షాపు ఏర్పాటు చేసుకున్న. వస్తువులు కొనుగోలు చేసిన సెట్లకు ఇంకా డబ్బు ఇవ్వలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

–దొడ్డశాని సంతోష్, సూపర్ మార్కెట్ నిర్వాహకుడు

ఇంటికి రూ. 4లక్షలు ఇవ్వాలి



వరద ఉధృతిలో సర్వం కోల్పోయాం. ప్రతి ఇంటికీ ప్రభుత్వం రూ.4లక్షలు ఇచ్చి ఆదుకోవాలి. వరదలో 3 తులాల బంగారం, రూ.15వేల నగదు, వంట గ్యాస్, భూమి పాస్‌పుస్తకాలు, ఇతర వస్తువులు కొట్టుకుపోయాయి. మిగిలిన వస్తువులను కడుకుంటున్నాం. ఇప్పటికీ ఒక్క అధికారి కూడా వచ్చి నష్టం గురించి సర్వే చేయలేదు.

–సూరం రాజయ్య, వరద బాధితుడు

రూ.3 లక్షల నష్టం జరిగింది



వరద కారణంగా కొన్ని వస్తువులు తడిశాయి. మరి కొన్ని వస్తువులు కొట్టుకుపోయాయి. రూ.లక్ష విలువైన బండి కొట్టుకుపోయింది. ఫ్రిడ్జి, కూలర్, బట్టలు, ఇతర వస్తువులు తడిశాయి. సుమారు రూ.3 లక్షల ఆస్తి వరకు నష్టం జరిగింది. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.

–కోటగిరి తిరుమల, మోరంచపల్లి వరద బాధితురాలు

గ్రామాన్ని తరలించాలి..



2001లో గ్రామానికి భారీ స్థాయిలో వరదలు వచ్చాయి. అప్పుడే గ్రామాన్ని తరలించాలని వేడుకున్నాం. అయినా అధికారులు పట్టించుకోలేదు. మూడు రోజుల క్రితం వచ్చిన వరదలకు గ్రామంలో నలుగురు కొట్టుకుపోయారు. గ్రామస్తులమందరం సర్వం కోల్పోయి కట్టుబట్టలతో పునరావాస కేంద్రాల్లో ఉంటున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం మోరంచపల్లి గ్రామాన్ని తరలించాలి.

–కర్ర పుష్పలీల, మోరంచపల్లి వరద బాధితురాలు

కాలేజీ యాజమాన్యం పరీక్ష ఫీజు తీసుకోవడం లేదని..

● విద్యార్థి ఆత్మహత్య

హసన్‌పర్తి: కాలేజీ యాజమాన్యం పరీక్ష ఫీజు తీసుకోవడం లేదని మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా 56వ డివిజన్ పరిమళ కాలనీలో శుక్రవారం రాత్రి జరిగింది. మృతుడి తండ్రి శనివారం కేయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాలనీకి చెందిన కందకట్ల జనార్దన్ కుమారుడు గౌతం (21) నగరంలోని వాగ్దేవి కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్నాడు. హాజరు నమోదు తక్కువగా ఉండడంతో ఎగ్జామ్స్ ఫీజు తీసుకోవడానికి యాజమాన్యం నిరాకరించింది. దీంతో మనోవేదనకు గురైన గౌతం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడి తండ్రి జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

పలువురి గల్లంతు.. మృతదేహాలు లభ్యం

భారీ వర్షాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలుచోట్ల గల్లంతైన పలువురి మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. దీంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.



లక్ష్మి(ఫైల్)

వెంకటాపురం(ఎం): మండలంలోని నల్లగుంట పరిధి బిలుగుకుంటలో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. నల్లగుంట గ్రామానికి చెందిన సాద లక్ష్మి గత గురువారం బిలుగుకుంట వైపు వెళ్లి కాలువలో పడి వరదలో కొట్టుకుపోయింది. కాగా, మూడు రోజులుగా కుటుంబ సభ్యులు.. లక్ష్మి ఆచూకీ కోసం పలుచోట్ల వెతికారు. అయినా ఫలితం కనిపించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు శనివారం ఉదయం నీటి వనరుల్లో వెతకగా బిలుగుకుంటలో లక్ష్మి మృతదేహం కనిపించింది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వెంకటాపురం ఎస్సై తాజుద్దీన్ తెలిపారు.

నడికూడలో గుర్తుతెలియని మహిళ మృతదేహం..

నడికూడ: మండల కేంద్రంలోని పెద్ద చెరువు పక్కన గల చింతలపల్లి భీమ్‌రావు పొలంలోకి శనివారం గుర్తుతెలియని మహిళ మృతదేహం వరదకు కొట్టుకొచ్చింది. దీనిని చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. వారు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. కేవలం అస్థిపంజరంతో ఉన్న మృతదేహాన్ని సీఐ వెంకట్ రత్నం, ఎస్సై శివకృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్ వరుణ్ పంచనామా నిర్వహించి ఖననం చేశారు. అనంతరం వీఆర్ఏ అంబి వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల ఎస్సై శివకృష్ణ తెలిపారు.

జంపన్నవాగులో వ్యక్తి మృతదేహం..

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని గోనెపల్లి గొత్తికోయ గూడేనికి చెందిన నందయ్య (50) మృతదేహం లభ్యమైంది. మేడారం జంపన్నవాగు సమీపంలోని మామిడి తోటకు కాపాలా ఉంటున్న ఆయన.. గురువారం జంపన్నవాగు వరదలో గల్లంతయ్యాడు. వరద తగ్గడంతో వాగు పక్కన ఇసుకలో శనివారం నందయ్య మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహం బయటకు తీసి పంచనామా నిర్వహించారు.

అన్ని విధాలా ఆదుకుంటాం

● బాధితులకు ప్రభుత్వం అండ
● నష్టం అంచనా వేశాం.. త్వరలో పరిహారం
● రాజకీయాలకు ఇది సమయం కాదు
● రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

హన్మకొండ అర్బన్ : వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఊహించని విధంగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని, బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో ప్రాథమికంగా రూ.414 కోట్లు నష్టం జరిగినట్లు అంచనా వేశామన్నారు. ఇందులో వరంగల్ జిల్లాలో రూ.89 కోట్లు, హనుమకొండలో రూ.146 కోట్లు, గ్రేటర్ పరిధిలో రూ.179 కోట్లు అంచనా వేశామన్నారు. 36 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 4668 మంది బాధితులను తరలించామన్నారు. గ్రేటర్ పరిధిలో 38 రెస్క్యూ టీమ్‌ల ద్వారా 2,055 మందిని రక్షించామని తెలిపారు. 207 ఇళ్లు పూర్తిగా, 480 ఇండ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయని అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. త్వరలో పరిహారం అందజేస్తామని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ ముందు చూపుతో ప్రమాదం తప్పిందన్నారు. భద్రకాళి చెరువుకు గండి పండిదనే విషయం తెలుసుకున్న అధికారులు.. ప్రాణహాని కలుగకుండా వెంటనే చర్యలు చేట్టారన్నారు. వరద బాధితులకు సహకారం అందజేస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్‌లో ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు 14 సెంటీ మీటర్లు వర్షపాతం నమోదైందన్నారు. 154 ప్రాంతాలు జలమయయ్యాయని తెలిపారు. బీటీ రోడ్లు 38 కిలో మీటర్లు, సీసీ రోడ్లు 43 కిలోమీటర్లు, మెటల్ రోడ్లు 95 కిలో మీటర్లు ధ్వంసమయ్యాయన్నారు. వర్షాలకు వరంగల్‌లో ఒకరు, హనుమకొండలో ఆరుగురు మృతి చెందారన్నారు. హనుమకొండలో 4137 చెరువులు దెబ్బతిన్నాయన్నారు. ఆర్‌అండ్‌బీకి సంబంధించి వరంగల్‌లో 22 కిలోమీటర్లు, హనుకొండలో 22 కిలోమీటర్లు ధ్వంసమయ్యాయన్నారు. పంట నష్టం కూడా అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి పంపామని తెలిపారు. ఈ సమయంలో ప్రతిపక్షాలు రాజకీయం చేస్తూ ప్రజలను రెచ్చగొట్టొద్దని, సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. భద్రకాళి చెరువు మరమ్మతులు వెంటనే చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అస్వస్థత





చికిత్స పొందుతున్న మీనాక్షి, రుత్విక

గూడూరు: మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బా విద్యాలయంలో శుక్రవారం రాత్రి ఇద్దరు బాలికలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డారు. ఊట్లకు చెందిన బానోతు మీనాక్షి ఇంటర్ మొదటి సంవత్సరం, బ్రాహ్మణపల్లికి చెందిన మేరుగు రుత్విక అదే పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. ఇద్దరు కొంత కాలంగా శ్వాస కోశ ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో బాలికలు శ్వాసకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గుర్తించిన ఉపాధ్యాయులు వెంటనే గూడూరు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం వైద్యుడి సూచన మేరకు మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం బాలికలు ఆరోగ్యంగా ఉన్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణ పనులు ముమ్మరం

● టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు



తడిసిన రికార్డులను పరిశీలిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, విద్యుత్ ఉద్యోగులు నిరంతరాయంగా పని చేస్తున్నారని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. శనివారం వరంగల్ బొంది వాగులో కూలిన 33 కేవీ లైన్ విద్యుత్ టవర్‌ను పరిశీలించారు. అనంతరం వరంగల్ పోతన నగర్‌లో నీటి మునిగిన విద్యుత్ ఈఆర్ కార్యాలయాన్ని సందర్శించారు. తడిచిన రికార్డులు పరిశీలించారు. రికార్డులు తడి ఆరబెట్టి భద్రపరచాలని సూచించారు. అదే విధంగా వరద ఉధృతి తగ్గిన తర్వాత బొంది వాగులో కూలిన టవర్ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని చోట్ల విద్యుత్ సరఫరా అందించగలిగామని, 24/7 ఉద్యోగులందరూ ఫీల్డ్‌లో ఉంటూ పనులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లిఖార్జున్, డీఈ(టెక్నికల్) అనిల్ కుమార్, ఏడీఈ పి.శ్రీనివాస రెడ్డి, ఏఈ మహేందర్ పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లాలో కిషన్ రెడ్డి పర్యటన



గండిని పరిశీలిస్తున్న రావు పద్మ

హన్మకొండ : కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆదివారం హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించనున్నారని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలిపారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకుని, అక్కడి నుంచి భూపాలపల్లి జిల్లాకు చేరుకుంటారని వివరించారు. జనగామలో ఉదయం 9.30 గంటలకు అల్పాహారం చేసి అక్కడి నుంచి 10 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 12 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లికి చేరుకుంటారన్నారు. మోరంచపల్లిలో గంట పర్యటిస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు రేగొండకు చేరుకుని మధ్యాహ్నం భోజనం చేస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 3.30 గంటలకు నగరానికి చేరుకుని హనుమకొండ, వరంగల్‌లో వరద ప్రభావిత ముంపు ప్రాంతాలను సందర్శిస్తారు.


భద్రకాళి చెరువును పరిశీలించిన రావు పద్మ

వరంగల్ పోతన నగర్ వద్ద భద్రకాళి చెరువుకు పండిన గండిని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పరిశీలించారు. ఆమె వెంట నాయకులు ప్రితీష్, ఆకాష్ ఠాకుర్, నదియా, నరేష్, పవన్, గౌతం, వినీత్ ఉన్నారు.

ప్రతికూల పరిస్థితుల్లో..

సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

● తొలి దశలో మొక్కల సాంద్రత కాపాడుకోవాలి
● పంటలో నీరు నిల్వ లేకుండా చూడాలి
● కేవీకే శాస్త్రవేత్త రాజు





డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

కరీమాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వివిధ పంటలు నీట మునుగుతున్నాయి. కొన్ని చోట్ల మొక్కలు ఎర్రబారుతున్నాయి. ఫలితంగా లక్షలాది రూపాయల పెట్టుబడి నీటిపాలు అవుతోంది. దీంతో రైతులు ఘొల్లుమంటున్నారు. ఈ ప్రతికూల పరిస్థితుల్లో పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రాజు అన్నారు. తొలి దశలో మొక్కల సాంద్రత కాపాడుకుని తర్వాత దశల్లో దిగుబడి తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతుల గురించి ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పత్తి..



వర్షాభావ పరిస్థితులతో పత్తి మొక్కలు సుమారు 30 రోజుల దశలో ఉన్నాయి. వర్షపు నీరు నిలిస్తే ఆకులు ఎర్రగా మారి చనిపోతాయి. ఈ నేపథ్యంలో నీటిని బయటకు పంపి ఎకరాకు 25–30 కిలోల యూరియా, 10–15 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్‌ను వేయాలి. వర్షం తగ్గిన అనంతరం అవసరం మేరకు పొటాషియం నైట్రేట్ 2 శాతం 20 గ్రాములు నీటిలో కలిపి పది రోజులలో రెండు సార్లు పిచికారీ చేయాలి. మొక్కలు వాలిపోతే కాపర్ ఆక్సీక్లోరైడ్ నీటిలో కలిపి మొక్కల దగ్గర పోయాలి. మొక్క నీరసంగా ఉంటే 13–0–45ను నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ క్రమంలోనే 19–19–19, మల్టీ–కె లాంటివి పిచికారీ చేయాలి.

వరి..



నారుమడుల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి. చిన్నమొలకలు అధిక నీటిని తట్టుకోలేవు. ఈ నేపథ్యంలో వెదజల్లే పద్ధతిలో విత్తుకున్న రైతులు పొలాల్లో, మడులలో నిలిచిన నీటిని తొలగించాలి. వర్షాలు తగ్గాక నారు ఎర్రబడే అవకాశముంది. మడిలో మోతాదు ప్రకారం యూరియా వేయాలి. కార్బన్డిజం, మ్యాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి. నారు కొనలు ఎర్రగా మారితే జింక్ సల్ఫేట్ పిచికారీ చేయాలి. ఇక నాటు వేసిన రైతులు వరద ఉధృతి తగ్గగానే యూరియా వేయాలి. అవసరం మేరకు జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలి.



మొక్కజొన్న..

మొక్కజొన్నలో అధిక తేమతో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలు ఊద రంగులోకి మారే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో డీఏపీ, 19–19–19 లాంటి యూరియాను వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి. వర్షాలు ఆగిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి.

కంది..

అధిక తేమతో మొక్కలలో ఇనుము లోపంతో ఆకులు పసుపు రంగులోకి మారి ఎండి రాలిపోయే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో నివారణకు అన్నభేది, నిమ్మ ఉప్పు కలిపి పైరుపై వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వర్షం తగ్గిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి.

మిరప..



మిరప పంట ప్రస్తుతం నారు మడి దశలో ఉంది. ఈ నేపథ్యంలో రైతులు నీరు పోవడానికి కాలువలు చేసి ఉంచాలి. నారుమడిని పాలిథిన్ షీట్‌తో గాని, వరి గడ్డితో గాని వర్షం తగ్గే వరకు కప్పి ఉంచాలి. వర్షం తగ్గాక వేరు కుళ్లు తెగులు రాకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ మోతాదు ప్రకారం నీటిలో కలిపి మొదళ్ల దగ్గర పోయాలి.